**మలిదశ** తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన సంస్థల్లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఒకటి. మధు కె.రెడ్డి, సుధీర్ కోదాటి, విమల కటికనేని సహా మరెంతో మంది తెలంగాణ బిడ్డలు దీనిని ఏర్పాటు చేశారు. పుట్టిన నేలమీద మమకారంతో ప్రవాసంలో ఉద్యమం మొదలుపెట్టారు. మన బిడ్డల కోసం, మన రాష్ట్రం కోసం అమెరికాలో తెలంగాణ వాదాన్ని వినిపించారు. ముక్కోటి గొంతుకల పోరాటం ఫలించింది. తెలంగాణ సిద్ధించింది. రాష్ట్రం కోసం రాజకీయ పోరాటం ముగిసింది. ఇక ఉద్యమ ఆకాంక్షల కోసం కూడా మనం పని చేయాలని కొంతమంది తెలంగాణ ఎన్నారైలు చేయి చేయి కలిపారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధి కోసం పరిశ్రమకు పూనుకున్నారు. సుధీర్ కోదాటి, మేరెడ్డి రవిప్రకాశ్ రెడ్డి, రమేశ్ నల్లవోలు, మాధవ మొసర్ల, వినయ్ మేరెడ్డి మరికొంతమంది ఎన్నారైలు కలిసి 'తెలంగాణ రాష్ట్రం కోసం మనవంతు ప్రయత్నం చేసినట్టే. తెలంగాణ బాగు కోసం పని చేయాలె' అని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**డయల్ యువర్ విలేజ్**

తెలంగాణ అభివృద్ధి కావాలంటే ముందు మన సమస్యలేమిటో తెలుసుకోవాలనుకున్నారు. వాటిని చర్చించడానికి, పరిష్కారాలు వెతకడానికి 'డయల్ యువర్ విలేజ్' కార్యక్రమం ప్రారంభించారు. పల్లెను దాటి అమెరికా చేరినా తమకు జన్మనిచ్చిన పల్లె గుండె చప్పుడు వినడం మొదలుపెట్టారు. అమెరికాలో ఉండి పల్లెను పలకరించే 'డయల్ యువర్ విలేజ్'తో వారానికి ఒక ఊరి బాగు కోసం చర్చ జరిపేవాళ్లు. మొదట సర్పంచ్‌లతో మాట్లాడేవాళ్లు. ఒకేరోజు ఒక సర్పంచ్‌తో మొదలుపెట్టి ఒకేసారి పదిమంది సర్పంచ్‌లతో మాట్లాడేదాకా ఈ కార్యక్రమం విస్తరించింది. వినేవాళ్లు, మాట్లాడేవాళ్లు పెరిగారు. ఈ మాటల మధ్య పల్లె సమస్యలే కాదు, అక్కడ పనిచేసే వ్యవస్థల గురించీ ఎన్నారైలకు అర్థమైంది. కొంతకాలానికి వారానికి ఒక శాఖకు చెందిన అధికారి, ఉద్యోగితో మాట్లాడటం మొదలుపెట్టారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, టీచర్లు, వ్యవసాయశాఖ అధికారులు, సామాజిక కార్యకర్తలు పల్లె ప్రగతికి సలహాలిచ్చారు. ఇలా వారంవారం పల్లెతో జరిపే సంభాషణ నాలుగేండ్లపాటు సాగింది. గ్రామాల్లో విద్య, గ్రంథాలయాలు, ఆరోగ్యం కోసం కొన్ని సందర్భాల్లో ప్రత్యేకంగా చర్చించేవారు. వీటి సారాంశాన్ని ప్రజలందరికీ చేరవేసేందుకు రంగాల వారీగా నివేదికలు రూపొందించారు. ప్రజల సమస్యలను, వాటి పరిష్కారానికి మార్గదర్శకాలు రూపొందించి సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేశారు.

**చేంజ్ లీడర్స్**

'మాటలు సరే.. మార్పు సంగతేమిటి' అన్న చర్చ వచ్చిన తర్వాత డయల్ యువర్ విలేజ్ ఆధ్వర్యంలో 'పీపుల్స్ మ్యానిఫెస్టో'ని విడుదల చేశారు. తెలంగాణ పల్లెల ప్రగతి కోసం వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఎలాంటి మార్పులు తెస్తే బాగుంటుందో తెలియజేస్తూ రాజకీయ పార్టీలకు ప్రజల పక్షాన నివేదిక సమర్పించారు. గ్రామాల ప్రగతికి పార్టీల తోడ్పాటు కోరుతూ విన్నవించారు. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూస్తూ ఉండిపోకుండా తమవంతు ప్రయత్నంగా పల్లెల్లో విద్యాభివృద్ధికి నడుం కట్టారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణాల్లో ఉండే విషయాలు తెలియవు. రూరల్ ఇంజినీరింగ్, అర్బన్ ఇంజినీరింగ్








విద్యార్థుల్లో ఎంతో వ్యత్యాసం ఉంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన బీటెక్ విద్యార్థులకు బయటి ఉద్యోగావకాశాలు, నైపుణ్యాల గురించి పెద్దగా అవగాహన ఉండటం లేదని గుర్తించారు. ఆ లోపాలను అధిగమించేలా అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని ఎన్నారైలు మెంటరింగ్ ప్రోగ్రామ్ మొదలుపెట్టారు. మహబూబ్‌నగర్‌లోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కాలేజ్‌తో ఈ క్రతువుకు శ్రీకారం చుట్టారు. తర్వాత వాగ్దేవి, కిట్స్, బాసర ట్రిపుల్ ఐటీ మరెన్నో కాలేజీల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులకు స్కిల్స్, టెక్నాలజీ రంగంలో ఉద్యోగావకాశాలు, విదేశాల్లో పరిస్థితుల పట్ల అవగాహన కల్పిస్తూ వచ్చారు. ఈ కార్యక్రమానికి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అమెరికాలోని ప్రఖ్యాత సంస్థల్లో ఉద్యోగాలు చేసే సాంకేతిక నిపుణులతో గ్రామీణ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు అవకాశాలు, సాంకేతిక నైపుణ్యాలపట్ల అవగాహన కల్పించే ఈ కార్యక్రమం ద్వారా ఎంతోమంది ఉన్నత స్థితికి చేరుకున్నారు.

**విద్యా వారధి**

పెద్ద చదువులు చదివాక చాలామంది ఇంటిదారి పడుతున్నారు. విశాలమైన ప్రపంచంలో అవకాశాలు విస్తృతంగా ఉన్నా.. ఆశలు లేకపోవడమే దీనికి కారణం. ఇది ఎంతోమంది తెలివైన విద్యార్థులకు శాపం. ఈ దుస్థితి పోవాలంటే ఆశలు రేకెత్తించాలి. అందుకోసం అమెరికాలో ఉండే పిల్లలతో ఇక్కడి గ్రామీణ విద్యార్థులను మాట్లాడించడం మొదలుపెట్టారు మన తెలంగాణ ఎన్నారైలు. ఆన్‌లైన్‌లో సాగే ఈ పరిచయ కార్యక్రమంలో అమెరికాలో చదువు ఎలా ఉంటుంది. అక్కడ చదువుకునే పద్ధతుల గురించి ఇక్కడి విద్యార్థులతో పంచుకునేలా చేశారు. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎలా చదువుతున్నారో అమెరికా విద్యార్థులు తెలుసుకుంటున్నారు. ఇలా మాట్లాడటం వల్ల తెలంగాణ పల్లె జీవితం, ఇక్కడి బాల్యాన్ని ఎన్నారై విద్యార్థులు అర్థం చేసుకుంటారు. తమ పూర్వీకులు, గ్రామీణ జీవితం మీద వాళ్లకు అవగాహన ఏర్పడుతుంది. అమెరికా విద్యాలయాల్లో ఉండే ఎక్స్‌ట్రా కరికులమ్ గురించి, ఆటపాటల గురించి కూడా ఇందులో చర్చిస్తున్నారు. ఇలా ఇరు దేశాల విద్యార్థులు మాట్లాడుకోవడం వల్ల 'నేనూ గొప్పగా చదవాలి, ఉన్నత స్థితికి చేరుకోవాలి' అనే పట్టుదల విద్యార్థుల్లో పెరుగుతుందని అంటున్నారు నిర్వాహకులు. అక్కడి పిల్లలు, ఇక్కడి పిల్లల మాటల మధ్య భాషా సమస్య రాకుండా అమెరికా విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, తెలంగాణ విద్యార్థులకు ఉపాధ్యాయులు సహకరిస్తూ జూమ్ మీటింగ్‌లో మాట్లాడిస్తున్నారు. మూడేండ్లుగా వారంవారం నడుస్తున్న ఈ విద్యా వారధిలో వేలాది మంది పిల్లలు పాల్గొని కొత్త సమాజాన్ని, వాళ్ల జీవితాన్ని తెలుసుకుంటున్నారు.

**నిన్ను నువ్వు మార్చుకో..**

'ఎదగాలనే కలలు కనడం నేర్పడంతోనే ఆగిపోవద్దు. ఆ కలలను రాసుకోండి. వాటి కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోండి. మిమ్మల్ని మీరు సరిదిద్దుకోండి. అందుకోసం రోజూ డైరీ రాయండి' అని విద్యార్థుల చేతికి డైరీలు ఇచ్చింది ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్. 50 పాఠశాలల్లో చదివే పదివేల మంది చిన్నారుల చేతికి డైరీలు ఇచ్చారు. ప్రతిరోజూ విద్యార్థులు చేయాల్సిన పనులను ఈ డైరీలో మొదటి పేజీల్లో రాశారు. అలాగే డైరీ ఎలా రాయాలి? ఏ ఏ విషయాలను ప్రస్తావించాలో ప్రశ్నల రూపంలో మొదటి పేజీలో ఇచ్చారు. ఈ ప్రశ్నలకు సమాధానాల్లా డైరీ రాయడం మొదలుపెడితే కొన్నాళ్లకు సొంతంగా రాసుకునే సామర్థ్యం